హృదయమా... సాగిపోమన్నా

ఇచ్ఛాపురపు రామచంద్రం

"రండి డాక్టర్!" చిరునవ్వుతో ఆహ్వానించింది నర్స్ లాబొరేటరీ నించి వార్డ్ వేపు వొస్తున్న డాక్టర్ రిషిని.

"ఆరూ. ఏడూ ఎలాగ ఉన్నారు?" ఆత్రంగా అడిగాడాయన ఆమెని చూస్తూనే-మిగిలిన చాలా విషయాలు మరచి.

"ఆరు - లంగ్ పేషెంట్ మెరుగౌతున్నాడు. కాని....ఏడు.... హార్ట్ పేషెంట్.... నిజంచెప్పాలంటే-క్షీణిస్తూంది పరిస్థితి." మెల్లగా అంది నర్స్. అతనొక నిట్టూర్పు విడిచి బెడ్స్ వద్దకు నడిచాడు. లంగ్ పేషెంట్‌తో చాలా ఉత్సాహంగా మాట్లాడాడు. హార్ట్‌పేషెంట్‌ని పలకరించేందుకే ఎంతో ప్రయత్నంచేయవలసి వొచ్చిందిఓడిపోడం తథ్యమని తెలిసి ఉత్సాహపరచడానికి లాగ. ఓడిపోతున్నది ఆ పేషెంట్ కాక తనే అనిపించిందతని కాక్షణాల్లో. అక్కడ ఉండలేక పోయినట్లు.

"నేను వెళ్తాను సిస్టర్...." అంటూ వార్డు నుంచి బయటకు వచ్చాడు. అతను తీవ్రంగా ఆలోచిస్తూ గార్డెన్ వేపు నడవసాగాడు. ఆ హార్టు పేషెంట్‌ని తను రక్షించలేడు - అనే భావం నిరుత్సాహ పరచి వొదులుతోంది. అతనిమీద జాలిగా ఉంది - చచ్చిపోతాడని - తన మీద తనకే కోపంగా ఉంది. రక్షించలేకపోతున్నానే అని.

అతను గార్డెన్‌లోకి వొచ్చేసరికి - చీకటిపడి - చందమామ వొస్తున్నాడు. అక్కడ రిషికి కొంచెం కొత్త సన్నివేశం ఎదురయింది. ఆశ్చర్యకరంగా. టీపాయ్ చుట్టూ నాలుగు కుర్చీలు. యామినితోపాటు మరో యిద్దరు యువకులు. వాళ్లు డాక్టర్‌కి నమస్కరించారు లేచి నిలబడి.

"పరిచయాలువింటూ టీ తీసుకోండి. మీరు చాలా అలసిపోయి నట్లున్నారు." కోపాలోంచి టీని కప్పుల్లో పోసి మొదటితండ్రికిఅందించింది యామిని.

"నా పేరు ప్రసాద్. యామినితో కలిసి చదివాను. యామినినెంత ప్రేమించానో మాటలతో చెప్పలేను."

"ఓహో!" నవ్వాడాయన యామిని వేపు నువ్వేంమటావన్నట్లు చూస్తూ.

ఆమె తలవొంచుకుని.... కాని.... నేను ... శేఖర్‌ని ప్రేమించాను." అంది మెల్లగా . ఎందుకో ఆ కంఠంలో తొణికిసలాట.

"అలాగా, ఐతే మీరు-" అతనివేపు చూస్తూ- "శేఖరన్న మాట. అభినందనలు. అన్నట్లు... యింతకీ మీరు యామినిన్ప్రేమిస్తున్నారా?" ఆత్రంగా అడిగాడు రిషి.

"కాని... నన్ను యామిని చేసుకోడం నాకిష్టం లేదు,"

త్రుళ్ళిపడ్డాడు రిషి. అమ్మాయంటే ఆయనకి పంచప్రాణాలు. శ్రీధరి చాలాకాలం క్రిందట చనిపోయింది. తనకి ఆమె గుర్తుగా యామినిని వొదిలి. అమ్మలేని ఆ అమ్మాయిని ప్రాణం కంటె ఎక్కువగా ప్రేమిస్తూ పెంచుతున్నాడు, ఆయనకి ఒక కన్ను వైద్య శాస్త్రమయితే రెండోకన్ను యామిని. ఆమెకే విధమయిన లోటూరాకూడదు జీవితంలో.

"ఎందుకని భయంగా అడిగాడు ?"

నాకు హృదయభాగంలో తరచుగా నొప్పి వస్తూంటుంది, ఉధృతంగా, బహుశా నేను హార్టు పేంషెటునేమో!"

డాక్టర్ రిషి విభ్రాంతుడయ్యాడు. శేఖర్‌కి హృదయ సంబంధ వ్యాధా!

"మీరొక్కసారి పరీక్షించి చెబితే.... మేము వొచ్చిందందుకే డాక్టర్!" ప్రార్థిస్తున్నట్లన్నాడు ప్రసాద్.

"రండి -" అంటూ శేఖర్ చెయ్యి పట్టుకుని హాస్పిటల్ భవనాల వేపు నడిపించుకు వెళ్ళాడు. డాక్టర్,

కొన్ని గంటల అనంతరం - ఒక్కడే తిరిగి వచ్చాడు తను ప్రసాదూ, యామినీ నిరీక్షించి నిరీక్షించి చాలా అలసిపోయాక

ఒంటరిగా వొస్తున్న డాక్టరేం చెబుతాడో అని వారి గుండెలు విపరీత మయిన భయంతో చాలా వేగంగా కొట్టుకుంటున్నాయి.

అతను కుర్చీలో నీరసంగా కూలబడి - "వెరీ సారీ. శేఖరం హార్టు చాలా చెడిపోయింది. మందులూ, చికిత్సా రిపేర్ చేయలేనంతగా" అన్నాడు చాలా జాలిపడుతున్నట్లు పరిస్థితికి,

ఆయన మాటలు - వారిద్దరికీ పిడుగులు పడ్డట్లే వినిపించాయి. కొన్ని నిముషాలు వారి ముగ్గురి మధ్యా అతి భయంకరమయిన నిశ్శబ్దం ఆవరించింది.

"రిపేర్ చేయలేనంతగా.... కాని...రీ ప్లేస్ చేయలేనంత కాదుగా? హటాత్తుగా అప్రయత్నంగా అన్నాడు ప్రసాద్. ఆ మాటలు అతను సహజంగా అన్నట్లు లేవు. ఏదో శక్తి ఆవహించి అనిపించినట్లు. ఉలిక్కిపడ్డాడు డాక్టర్. ఒక్కసారి కళ్ళముందు-శతకోటి కాంతుల విద్యుల్లత మెరిసినట్లు. ఆ మెరుపు అతనిలో ఎంతో ఆశ, ఆనందాలతో పాటు - ఆందోళననీ భయాన్నీ కూడా కలిగించింది.

మూసుకున్న అతని కనుల వెనుక......

లాబొరేటరీలో.... క్లాంప్‌లకి బిగించబడిన కోతులు...రెండూ ఒక దానికొకటి సమీపంగా... అక్కడక్కడ రక్త బిందువులు స్రవిస్తూ. వాటిమీద ప్రయోగం చేశాడు తను. ఆరోగ్యకరమయిన ఆ రెండు కోతులకి ఒకదాని హృదయం మరోదానికి మార్పుచేశాడు-నిన్న, ఇవాళ్టివరకూ అవి రెండూ బాగానే సజీవంగానే ఉన్నాయి!

కుక్కలఊపిరితిత్తులు (లంగ్స్) మార్చి చేసిన ప్రయోగానికి అది యిచ్చిన ఉత్సాహానికి పరిణామమిది' హాస్పిటల్లో హార్టుపేషెంట్ చేరాక - అవసరం కలిగించిన ఆలోచన కలిగించిన-కోతుల హృదయం మార్పిడి.

హార్టుమీద అది తొలి ప్రయోగం. సజీవంగా ఉన్న ఆ కోతుల మీద ఎంతో ప్రేమ కలిగింది-ఆటగాడికి తనకి విజయం చేకూర్చిన బంతి మీదలాగ.

కాని - అవి కోతులు. వాటిదీ ప్రాణమే అయినా - మనిషి ప్రాణం.

వాటిమీద చేసే ప్రయోగాలు. వాటి ఫలా ఫలా లెలా ఉన్నా ఎక్కువ చింతించ నక్కరలేదు. మనిషి సంగతి వేరు. తను ఒక మనిషిగా - మిడి మిడి జ్ఞానంతో-మరో మనిషి జీవితం మీద ప్రయోగం చేసే అధికారం తనకిలేదు ప్రాణాలతో చెలగాటమాడే హక్కుతనకి లేదు.

"ఆరోగ్యవంతుడినైన నాలో నిశ్చయంగా ఆరోగ్యవంత మయిన హృదయం ఉండి తీరుతుంది. దానిని తీసి-శేఖర్ కమర్చండి".

"కాని నువ్వు మరణిస్తావు!" ఎలాగో అన్నాడు వొణుకుతూ-

కాని.... శేఖర్.... యామిని ప్రేమించిన శేఖర్ సుఖంగా యామినితో ఉంటాడు. ఆమె ప్రేమని పొందలేని నేనెలాగూ మరణించడానికే నిశ్చయించుకున్నాను. నేను కోరుకునేది యామిని సుఖసంతోషాలు. ఆమె కోసం ప్రాణమిస్తాను. అదేనా ఆనందం.

డాక్టర్ హృదయం గంతులువేసింది ఆనందంతో ఒకక్షణం. ఎటువంటి సువర్ణావకాశమిది!హృదయం మార్పిడి.వైద్యశాస్త్రానికేయిది సరికొత్త ప్రక్రియ. ఏశాస్త్రజ్ఞుడూ దీని వేపింతవరకూ దృష్టిసారించిన దాఖలాలులేవు. తనెంతఅపురూపమయిన అదృష్టం వరిస్తుంది. ప్రయోగానికొక మనిషి,ఆరోగ్యవంతమైన హృదయం.ప్రసాద్ కంఠంలో ఎంత నిశ్చయం.ప్రేమకింతబలమూత్యాగంచేసే శక్తిఔన్నత్యమూఉన్నాయా?

"కాని.. ప్రసాద్!.. ఈ ప్రక్రియ.. దీన్ని హార్ట్ ట్రాన్స్‌ప్లాన్టేషనే అనాలో, గ్రాఫ్టింగ్ అనాలో.. ఇది వైద్యశాస్త్రానికే వినూత్నం. దీనికింకా నామకరణమే జరగలేదంటే " డాక్టర్‌మెదడు_ సజీవమయిన శిశువుని ప్రసవించే ముందు మాతృమూర్తిలా వేదన పడుతోంది. "మీరు పేరూపెడతారు, ప్రక్రియా మొదలు పెడతారు." నవ్వాడతను. "నేనా" ఆనందం.. ఆశ్చర్యం.. ఆందోళన.. భయం.. అన్నీను. ఒక అపూర్వమయిన.. అద్భుతమయిన.. వినూత్నమయిన.. ప్రపంచ గతినీ.. వైద్య విజ్ఞాన పథాన్ని మార్చివేయగలిగే అవకాశం- ఎంత అదృష్టం చేసుకుంటే లభిస్తుంది?

"వొద్దు_" అన్నాడు రిషి. అతని కంఠం వొణుకుతూంది.

"ఎందుకని?" వాడిగా ధ్వనించింది ప్రసాద్ కంఠం.

"హృదయం గురించి వైద్యరంగంలో తగినన్ని పరిశోధనలు జరగలేదింకా. లక్షణాలూ, స్వభావాలూ, చిత్రాలు, విచిత్రాలూ బయటపడలేదు. స్పాంజిముక్కవంటి హృదయం- శాస్త్రజ్ఞుడికింకా కొరుకుడు పడడంలేదు. ఒకరక్తాన్ని మరోమనిషిలో ఎక్కించడానికి పాటించవలసిన నియమాలూ తీసుకోవలసిన జాగ్రత్తలూ వలె ఒకమనిషి హృదయాన్ని మరోమనిషి కమర్చడంలో ఏం జాగ్రత్త లవలంబించాలో తెలియదు. మనిషినుంచి వేరు చేయబడిన హృదయం ఎంతసేపు మనగలుగుతుంది? హృదయాన్ని తొలగించిన మనిషిని కృత్రిమ ఉపకరణాలతో ఎంతసేపు ప్రాణాలతో ఉంచగలం? అన్నీ ప్రశ్నలే," నిస్పృహగా ఉంది డాక్టర్ కంఠం.

"ప్రశ్నలకి జవాబులు యిచ్చేది పరిశోధన. పరిశోధనకి ప్రాణం ప్రయోగం,ప్రయోగం చేయనిదే ఫలితాలురావు, ఆప్రయోగం నామీద చెయ్యండి డాక్టర్ తొలిసారిగా." నిర్ణయంతో కూడినట్లు ఇతనిమాటలు- డాక్టర్ హృదయాన్ని ఊయలలూపుతున్నాయి అతనిమీద- ప్రయోగం చేస్తే? ఆత్రత.. భయం..

"తరువాత.. కొంచెంసేపు- మీరు- హృదయం అనే మాటకు కండరం అనేలా భౌతికమయిన అర్థం వొదిలి - ప్రేమ అనే ఊహతో నామాటలర్థం చేసుకుందుకు ప్రయత్నించండి. ప్లీజ్.."

"ఏమిటి?"

"భౌతిక హృదయం కుంటుపడితే మానవ శరీరం ఎలా కుంటుపడుతుందో కాల్పనిక హృదయం దెబ్బతింటే మానవ జీవితమూ అలాగే తల్లక్రిందులౌతుంది. హృదయం- ప్రేమని- మనిషి ఒక్కసారే ఒక్కరికే యివ్వగలడు. ఒక్కరి హృదయాన్నే స్వీకరించగలడు. నేను ప్రేమించిన యామిని సౌఖ్యంకోసం ఆనందంగా నేను నా హృదయాన్ని త్యాగం చెయ్యగలను. నా జన్మని అలాగ ధన్యం చేసుకోవాలనే నా ఆకాంక్ష. అదే నా జీవితధ్యేయం. యామిని ప్రేమని- పొందలేకపోయిన నేను ఆత్మహత్య చేసుకుందుకు నిశ్చయించుకున్నాను. నాశరీరంలోని భౌతిక హృదయం- నేను ప్రేమించిన అమ్మాయి సుఖజీవనానికీ; వైద్యశాస్త్రాన్నే కొత్తమలుపు తిప్పి సకలమానవాళికీ ఉపకరించే మీ ప్రయోగానికీ కూడా వినియోగించ బడుతుందంటే- నాజన్మచరితార్థ మౌతుందసి నాకెంత సంతోషంగా ఉందో!"

డాక్టర్ గొంతుకేదో అడ్డం పడినట్లయింది. సవరించుకొని-" ఇప్పుడు- శేఖరొక్కడే మృత్యువుకి చేరువలో ఉన్నాడు, ప్రస్తుత వైద్యశాస్త్ర పరిజ్ఞానాన్ననుసరించి- నీ హృదయం తీయడమంటే- నిన్ను నిలువునా హత్యచెయ్యడమే. సారీ! నేను డాక్టర్నే కాని- హంతకుణ్ణి కాలేను."అన్నాడు, చాలా తగ్గు స్వరంతో."రేపు చనిపోయే మనిషిని- ఏ మహత్తర ప్రయోజనం కోసమయినా సరే- యివాళ చనిపోమంటే అతను ఎంత మాత్రమూ అంగీకరించడు. మనిషి ప్రాణానికున్న విలువ అది."

ప్రసాద్ నవ్వాడు. "ఐతే- అతనిలో ప్రాణమే తప్ప ప్రేమ లేదన్నమాట! డాక్టర్ ముఖం చిట్లించాడు ఆలోచనలో పడ్డట్టు. హృదయంలో- కర్ణికలూ, జఠరికలూ కవాటాలూ, రక్తనాళాలూ- యిటువంటివే తప్ప ప్రేమనే పదార్థమున్నట్టు ఏశాస్త్రవేత్తా పేర్కొనలేదే! శాస్త్రజ్ఞుడి శోధనకందని యీ ప్రేమలో జీవితాన్నే త్యాగం చేసుకోగలిగే శక్తి ఎలా ఉంది?

"డాక్టర్! ఒకవిషయం గుర్తించండి. బతకాలనుకునే వాణ్ణి బలవంతంగా చంపడం సాధ్యమేమో కానీ ఆత్మహత్యచేసుకుని అయినా చచ్చిపోవాలనుకునే మనిషినెవరూ బలవంతంగా ఆపలేరు. చచ్చిపోతున్న నా శరీరాన్ని- వైద్య విజ్ఞానపురోభివృద్ధికీ మానవజాతికీ, మానవాళిసేవకీ వినియోగించుకోక వ్యర్థ పరుస్తున్న మీరు- వైద్య శాస్త్రానికీ మానవజాతికీ కూడా ద్రోహం చేస్తున్నట్టే. నాచావుకి మీ బాధ్యతలేకుండా న్యాయసమ్మతమయిన కాగితాలూ రుజువులూ నేనే ఏర్పాటు చేస్తాను. మీరు నాసూచనని అమలు జరిపేసాహసం చేయగలిగితే.... కర్తవ్యం నిర్వహించగలిగితే.... "చివరి అస్త్రం ప్రయోగించి వెళ్లిపోయాడు.

ఇంక డాక్టర్ రిషికి నిద్రాలేదు, ఆహారమూ లేదు.

ప్రయోగ శాలలోనే గడుపుతూ ఉండిపోయాడు. స్థానికంగా అతనికీ అతని హాస్పిటల్‌కీ మంచి పేరుండడంతో మిగిలిన డాక్టర్లం దరూ అతనికి శిష్యసమానులే. వారిని పిలిచి సమావేశాలూ సంప్రదిం పులూ జరిపాడు। తను లోగడ యితర విషయం మీద మెడికల్ జర్నల్స్‌కి పంపి ప్రచురించిన ఆర్టికల్స్‌ని ఎందుకో మళ్ళీ చదివాడు-అవి తన కర్తవ్యాన్ని సూచిస్తాయేమో అన్న ఆశతో: చివరకు - ఆ దినం రానేవచ్చింది. అది మహత్తరమయినది. మహాభయంకరమైన దినం.

షవర్ కింద స్నానం చేస్తూంటే - మనసు ఎక్కడో తేలి పోతూంది.

ఎర్రగా ఆపిలు పండులా - సజీవమూర్తియైన ఆరోగ్యవంతమైన హృదయం.... నీలంగా.... నీరసం గొల్పుతూ.... రోగగ్రస్తమైన హృదయం చైతన్యానికి ప్రతీకలా ఆ ఎర్రని హృదయం.... వైద్య విజ్ఞానాన్ని దీనంగా ప్రాధేయపడుతున్నట్టు.... బేలగా.... జాలిగా.... నీలిహృదయం.

ఎరుపు.... నీలం ఆరోగ్యం - రోగం; జీవం - మృత్యువు. శేఖరంలోని నీలిహృదయాన్ని ఎర్రగా మార్చడం సాధ్యమేనా ?

ఆపరేషన్ థియేటర్‌లోకి రావలసిన డాక్టర్లందరూ వొస్తున్నారు. సమయందగ్గర పడుతోంది. వైద్యశాస్త్రానికే వింత అయిన హృదయపు మార్పిడిని కనులారా చూసి తరించడానికి.... నేర్చుకోడానికి... తెలుసుకోడానికి.. ఉత్సాహవంతులయిన డాక్టర్లందరూ వొస్తున్నారు.

చేతులని ఏంటీ సెప్టిక్ లోషన్‌తో కడుక్కుంటున్నాడు డాక్టర్ రిషి. రక్తాన్ని పరిశుద్ధంచేసే క్లిష్టమయిన ప్రక్రియను నెరపే ఊపిరితిత్తులు గురించి చాలానే తెలుసుకోగలిగిన వైద్య శాస్త్రం— పరిశుభ్రం గావించబడిన రక్తాన్ని శరీర భాగాలకీ, అపరిశుద్ధ రక్తాన్ని ఊపిరితిత్తులకీ పంపే రవాణా కార్యక్రమం మాత్రంచేసే హృదయం గురించి ఎక్కువ తెలుసుకోలేకపోయిందింకా. స్పాంజిముక్కలాటి.. హృదయకండరం" వైద్యవిజ్ఞానానికే అందని చందమామలా ఉండి పోయింది. ఆ చందమామ అందుతుందా ? దాన్నందుకునే ప్రయత్నం చేసే అవకాశం.. అదృష్టం. అయాచితంగా అనూహ్యమయిన రీతిలో తనని వరిస్తున్నాయి.

అతని అపరిమితమయిన ఆనందం. అంతులేని ఉత్సాహం. తన ప్రయోగం సాహసం....సఫలమైతే... మనిషి మనుగడే మలుపు తిరుగుతుంది. వైద్యశాస్త్ర క్రమశిక్షణ విజయవంతంగా మానవశరీర స్థితిలో మరి కొంతభాగాన్ని లొంగదీసుకుంటుంది: విఫలమయితే ?

ఒక ఆరోగ్యవంతుడైన యువకుడు బలి అయిపోతాడు. తనలో పట్టుదల మరీపెరిగి- విజ్ఞాన తృష్ణా వ్యసనంలో పడి-కోతులనీ కుక్కలనీ కుందేళ్లనీలాగే మనుషులని కూడా ప్రయోగాలకి చంపుతూపోతాడు. జిగీష తనని నిలవనీయదు. ఈ ప్రయోగం విఫలమైతే. డాక్టరుగా తనకున్న పేరుకి మచ్చ వొస్తుంది. మంచీ చెడూ విచక్షణని నశింపజేసే వ్యసనం-హృదయాన్ని జయించాలనే-జిగీష-తననెలాగయినా మార్చవొచ్చు.

చేతులకి రబ్బరు గ్లవ్స్ వేసుకుంటూంటే అతని చేతులు వొణికాయి. అప్రయత్నంగానే అతను చేతులురెండూ జోడించి కళ్లుమూసుకున్నాడు.

"భగవంతుడా ! నువ్వే నన్ను అర్థంచేసుకుని ఆశీర్వదించాలి. శరీరంలో కొంత భాగంగురించి తెలుసుకోగలగడమే-మిగిలిన భాగాలని కూడా జయించాలనే తృష్ణని రేకెత్తిస్తుంది నాలో. విజ్ఞానం విజ్ఞానాన్ని కోరుతుంది. విజ్ఞానం క్లిష్టమయిన మార్గంలో అయినా సరే సాహసంగా పరుగెత్తమంటుంది మానవుణ్ణి."

మహాశక్తివంతమయిన వెల్లువలా తన మీదకు వొచ్చిపడిన యీ అవకాశం ఒక్కొక్కసారి అగ్నిపరీక్షలాగ అనిపించి అతని హృదయాన్ని డోలాయమానం చేస్తుంది. ఇది అదృష్టమో...అగ్నిపరీక్షో తేలకుండా ఉందతనికి. హృదయం- ఆగని ఊయలే ఔతుంది. తను ప్రాణంపోసే ధన్వంతరి కాబోతున్నాడా, ప్రాణంతీసే హంతకుడా,

ఆక్షణాలు.... పరీక్షాక్షణాలు వేగంగా దగ్గర పడుతున్నాయి. డాక్టర్ రిషి-వార్డ్ వేపు నడిచాడు. అప్పటికే ఆపరేషన్ థియేటరుని సన్నద్ధంచేసి ఉంచారు నర్సులు. డాక్టర్ రిషికి సహాయపడే సర్జన్లు సిద్ధంగా ఉన్నారు. వాళ్లందరూ డాక్టర్ రిషి కోసం ఎదురు చూస్తూన్నారు.

"ప్రసాద్ మైడియర్ ప్రసాద్!.... చూడు.... ఇప్పటికయినా మించిపోయిందిలేదు. ఆలోచించుకో మరోసారి....చివరిసారి నువ్వు వొద్దంటే యిప్పుడయినా ఆనందంగా నా ప్రయత్నం విరమించుకుంటాను"

అతను-మందహాసం చిందించాడు." అదృష్టం జీవితంలో ఒక్కసారే తలుపు తడుతుంది డాక్టర్ ! అటుప్రేమనీ-యిటు వైద్య విజ్ఞానాన్ని సుసంపన్నం చేయగలిగే మహోన్నత మయిన యీ సువర్ణావకాశాన్ని చేజార్చుకునే అమాయకుడిగానో అజ్ఞానిగానో ఎందుకు భావిస్తారు నన్ను ?"

అంతే. మేజిస్ట్రేటు - కాగితాల మీద ప్రసాద్ సంతకాలు తీసుకున్నారు.

డాక్టరు రిషి మనస్థితి చెప్పనలవికాదు.

ఉద్రేకం.... ఉద్వేగం.... ఉత్సాహం....భయం.... ఆనందం జాలి....ఎన్నో భావాలు భావపరంపరలు.... అతని అంతరాన్ని మథించి వొదులుతున్నాయ్

థియేటర్లో డాక్టర్లు చాలా ఆత్రంగానూ ఉత్సాహంగానూ ఎదురు చూస్తున్నారు. డాక్టర్ రిషికోసం.... పేషెంట్లకోసం నాయకుడికోసం మహత్తరమూ, అపూర్వమూ అయిన సన్నివేశం కోసం. జరగబోయేది ఒకచోటనుండి మొక్కనుతీసి మరో చోట పాతడం వంటిది కాదు. నేటిదీకాదు. మనిషి ప్రాణాసికున్నంత చరిత్ర ఉంది దీనికి".

వార్డులో - గోడ గడియారం గంట కొట్టింది.

ఉలిక్కిపడ్డాడు డాక్టర్. అతనికి - కళ్ళముందు జరుగుతున్న నిజం కలకంటె కల్పన కంటె కూడా వింత నమ్మశక్యంగాకుండా ఉంది? ఇది—నిజమేనా ? కలకాదుకదా?

"ప్లీజ్....నాకు త్వరగా మత్తివ్వండి డాక్టర్." ప్రార్థిస్తున్నట్లే ఆత్రతగా అన్నాడు ప్రసాద్.

డాక్టరు యింక పూర్తిగా కొత్తమనిషైపోయాడు ఇపుడతను ఒక మనిషిలోని - ఇద్దరు మనుషులు కారు, ఒకే మనిషి....డాక్టర్! మత్తుమందిచ్చే అనస్తీస్ట్ వేపు చూశాడు. అర్థవంతంగా. చూసి- థియేటర్‌లోకి నడిచాడు.

"గుడ్‌మార్నింగ్ డాక్టర్."

"గుడ్‌మార్నిగ్"

అతను నాసికారంధ్రాలకు ఏంటీబయటిక్ ఆయింట్‌మెంట్ పూసుకున్నాడు. ఇప్పుడతని శరీరంలో ఏ భాగమూ కనిపించడం లేదు. స్థిరంగా.... గంభీరంగా.... నిశ్చలంగా ఉన్నాడు. ముఖానికి రబ్బరు ముసుగు (మాస్క్) వేసుకున్నాడు.

అతనిలో అంతులేని ఆత్మవిశ్వాసం.

"పేషెంట్లకి వార్డులోనే మత్తిచ్చారేం. ఆపరేషన్ థియేటర్‌కి తీసుకువచ్చి కాకుండా?" ఎవరో కొత్తడాక్టరడిగాడు.

"సమస్యలు రావనుకుంటే అలాగే యివ్వడం మంచిది. ఆపరేషన్ థియేటరూ. యీ హడావిడీ చూస్తే పేషెంట్లు అనవసరంగా కంగారు పడతారు."

"ఓహో!"

వైద్య సిబ్బంది మాత్రమే అని వ్రాయబడి ఉన్న ఆ తలుపులు తెరచుకున్నాయి. రెండు స్ట్రెచర్లు....ఒకదాని తరువాత ఒకటి శేఖర్ ప్రసాద్....

రెండు టేబుళ్ళమీదా పడుకోబెట్టారు. డాక్టర్ నడవబోతుంటే

"అటుకాదు డాక్టర్.....ఇటు....." అన్నాడు అతను.

అతనివేపు చూశాడు డాక్టర్ రిషి

ఔను. మీరు అతకబోయే హృదయం మీకు కొత్తగా అనిపించకూడదు, దీనితో మీకు పరిచయం ఉండడం మంచిది. ఆరోగ్యవంతమయిన హృదయాన్ని- పరిచయం చేసుకుంటూ.... స్నేహం పెంచుకుంటూ.... తొలగించండి. దాన్ని....ఆ హృదయానికి స్నేహితుడిగా మీరే-మీ పరిచిత హస్తాలతో రెండో పేషెంట్‌లో అమర్చండి."

"థాంక్యూ వెరీమచ్. చాలా చక్కని విషయం సూచించారు. అతను- ఆత్మవిశ్వాసంతో.. ఆశతో..అటునడిచాడు. ఇంక అక్కడ కాలం స్థంభించి పోయింది- వైద్య విజ్ఞాన వినువీధిలో ఏ నవోదయం కోసమో।

తొలిచూలు ప్రసవవేదన.. ఆశతో కూడిన వేదన.. ఆనందం కోసం ఎదురు చూపుతో మిళితమయిన బాధ. జీవం ప్రసవించే ముందు జీవితాలూకు మనోభావాలు..

సాధించిన విజ్ఞానం-సాధించవలసిన విజ్ఞానంవేపు నడిపిస్తూంటే కలిగేనిషా. ఒకటేమిటి, మాటలకందని ఎన్నోమనోభావాలు.

*   *   *

అది- నాంది. ఆదే నాంది, మనిషి హృదయాన్ని వైద్యుడు ఆప్యాయంగా అభిమానంగా, ఆనందంగా నిమురడానికి. కాలక్రమాన వైద్యశాస్త్రం సాధించిన- హార్ట్ ట్రాన్స్‌ప్లాన్టేషన్... గ్రాఫ్టింగ్, ఓపెన్ హార్ట్‌సర్జరీ వంటి అద్భుత ప్రక్రియలకీ. హృదయం పనిచేసే తీరుని తెలిపే ఎలక్ట్రో కార్డియో గ్రాఫ్ (ఇ. సి. జి) వంటి పరికరాలకీ- అన్నిటికీ ప్రారంభం ఆకర్షణాలే. ఆ మొగ్గనుంచే- సహస్రదళ వైద్యశాస్త్రం వికసించింది. ఆచర్యితే లేకపోతే- మానవ హృదయానికి యీవర్తమానమూ లేదు, భవిష్యత్తూ లేదు. అందుకే దానికంత ప్రాముఖ్యత.

ఇంకా విచిత్రంగా.. ఆ మొట్టమొదటి హృదయపు మార్పిడి అనే మహా యజ్ఞం నుంచి- ఉపఫలం (బైప్రాడక్ట్)గా సాహిత్యంలోకి సరికొత్త భావన ఉదయించింది. ఆనాటినుంచే. ఆమహత్తర సంఘటననుంచే- "హృదయమివ్వడం" అనేదానికి "ప్రేమించడం." అనే అర్థమూ భావమూ ఉద్భవించాయేమో! అది- అత్యంత సుమూహర్తం కనుకనే—

అటు వైద్యరంగములోని (భౌతిక) హృదయమూ, ఇటు సాహితీరంగంలోని (ప్రేమ) హృదయయీ చిరంజీవులయ్యాయేమో! ఔను.

ఆనాడు- "హృదయమా! సాగిపొమ్మా!" అని ఆశీర్వదించిన వారు అన్యులూ, సామాన్యులూ కారు. దేవతలే!

చెడు తలపులు!

ఎన్నిసార్లు

సరిదిద్దినా

ఎలాగో ఒకలాగ

"మనస్సు పుస్తకంలో"

చోటుచేసుకుంటునే ఉన్నాయి

ముద్రారాక్షసాల్లాగా॥

ఎంత టకటొంకువివి॥

సుకవుల కవిత్వం!

ఆదిలో

లేతనౌజు

ఆపై

కవటాకు

పైపై

పండుటాకు

తాంబూలంలాగా

దాంపత్యంలాగా

ఆద్యంతమూ

రసవంతమే అది॥

(కీ. శే. మల్లాదిరామకృష్ణశాస్త్రిగారికి కృతజ్ఞతలతో)

శ్రీ కె. కిశోరుబాబు

శ్రీ కె. అశోకుబాబు